సాక్షి
చిత్తూరు

సోమవారం, 27, జనవరి, 2025



నడకతోనే ఆరోగ్యం

నిత్య జీవితంలో నడకతోనే ఆరోగ్యం కలుగుతుందని డీఎఫ్‌వో భరణి తెలిపారు. చిత్తూరులో ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. - 8లో



వెల్లువెత్తిన అభిమానం

వైఎస్.జగన్, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిపై చౌడేపల్లె మండలానికి చెందిన యువకులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. - 8లో



మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా

బంగారుపాళెం మండలం మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా పడింది. క్లీనర్ మృతిచెందాడు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. - 8లో

న్యూస్‌రీల్

భక్తులతో పోటెత్తిన కాణిపాకం



క్యూలలో వేచివున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, ఉచిత దర్శన క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

వరసిద్ధుడి సేవలో విద్యాశాఖ డైరెక్టర్



డైరెక్టర్‌కు చిత్ర పటం అందజేస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈవో పెంచల కిషోర్ ప్రసాదం, స్వామి చిత్ర పటం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్ ఆయనతో పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి పాల్గొన్నారు.

కిటకిలాడిన బోయకొండ



చౌడేపల్లె : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శనం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో ఏకాంబరం చర్యలు తీసుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



క్యూలో ఉన్న భక్తులు



పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

బ్రిటీషు దాస్య శృంఖలాల నుంచి విముక్తి పొందిన భారతదేశం 1950 జనవరి 26న సర్వస్వతంత్ర సార్వభౌమ గణతంత్ర దేశంగా అవతరించింది. ఈ క్రమంలో ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఆదివారం ఉత్సవాలు మిన్నంటాయి. జాతీయ జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడదామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. దేశ నాయకులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా తిరంగా



జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

జిల్లాను అగ్రగామిగా నిలబెడతాం

- త్యాగధనుల పోరాటమే మన జీవనం
- సమగ్రాభివృద్ధిలో భాగస్వాములుకండి
- స్వాతంత్ర సమరయోధులు టీసీ రాజన్‌కు సన్మానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాలు, స్టాల్స్
- 76వ గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడదామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో 76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు టీసీ రాజన్‌ను ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలు చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం చెందిన బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమానుపెంటకు చెందిన సైనికుడు కార్తీక్ తల్లిదండ్రులు వరదరాజులు, సెల్వీని సత్కరించారు. కార్తీక్ కుటుంబానికి వ్యవసాయ భూమిని అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం భారతీయులందరికీ గొప్ప జాతీయ పండుగ అని అన్నారు. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవం నినాదం సంస్కృతి సంరక్షణ, అభివృద్ధి అని తెలిపారు. దేశ రక్షణలో మృతి చెందిన సైనికుడు కార్తీక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజల తరపున కార్తీక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. దీపం–2 పథకంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 3,17,158 కుటుంబాలు లబ్ధిపొందాయన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2,66,000 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందన్న ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 110 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 1,609 సీసీ రోడ్లు ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకు 1,150 పనులు పూర్తయ్యాయని తెలిపారు. అదేవిధంగా 2,108 గోకులం షెడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

సమానత్వాన్ని పాటిద్దాం

– జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పక్కన సీఈవో రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్:స్వేచ్ఛను అనుభవిస్తూ సమానత్వాన్ని పాటిద్దామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్‌నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలన్నారు. ప్రజలకు సేవ చేయడమే ప్రథమ విధిగా ప్రభుత్వ ఉద్యోగి భావించాలన్నారు.

జాతీయ రహదారుల అభివృద్ధి

జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో రూ.3,800 కోట్లతో చిత్తూరు–తచ్చూర్ జాతీయ రహదారి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు 2025 జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. అదేవిధంగా రూ.5,000 కోట్లతో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పనులు చేస్తున్నామని, వాటిని 2026 మార్చి నాటికి పూర్తి చేయనున్నట్టు వివరించారు.

దేశ భక్తి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర దినోత్సవంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు దేశ భక్తి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా వారు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ క్రమంలో విజయం విద్యాసంస్థల విద్యార్థులు మొదటి,లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు రెండు, న్యూయార్క్ సీబీఎస్ఈ పాఠశాల పిల్లలు తృతీయ స్థానాల్లో నిలిచారు. వారు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్‌లు అందుకున్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న స్టాల్స్, శకటాలు

76వ గణతంత్ర దినోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, శకటాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, డ్రిప్ ఇరిగేషన్, పశు సంవర్థక, పట్టు పరిశ్రమలు, జెడ్పీ, డీపీవో, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, ఐసీడీఎస్, డీఎంఅండ్‌హెచ్‌వో, సమాచార పౌరసంబంధాలు, హౌసింగ్, పోలీసు, అగ్నిమాపక శాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. అలాగే వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలు ప్రదర్శించారు. ప్రజల సంరక్షణ కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను తెలిపేలా పోలీస్ శాఖ శకటాన్ని ప్రదర్శించారు. విపత్తులు సంభవించిన సమయంలో ఆత్మ రక్షణ విధానాలను తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖకు చెందిన మిస్ట్ బుల్లెట్, మిస్ట్ జీపు, రెస్క్యూ టెండర్, దేవదాయ శాఖచే కాణిపాకం దేవస్థానం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి విశిష్టతను తెలుపుతూ శకటాన్ని ప్రదర్శించారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్, చంద్రన్న సంచార ఆరోగ్య పథకం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 108, 104, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్స్, మన బడి –మన భవిష్యత్తు వంటి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ విద్యాశాఖ రథాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలియజేస్తూ వ్యవసాయ శాఖ శకటం, ప్రధాన మంత్రి సూర్య ఘర్ (సోలరైజేషన్) శకటాలను ప్రదర్శించారు. వ్యవసాయ శకటం (మొదటి), విద్యాశాఖ (రెండవ), సోలరైజేషన్ శకటం (మూడవ) బహుమతులకు ఎంపికయ్యాయి. ఆయా శాఖల అధికారులు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. పోలీసు శాఖల జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, ట్రెనీ కలెక్టర్ హిమవంశీ, డీఎఫ్‌వో భరణి, డీఆర్‌వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్‌డీవో శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోలీసు జాగిలాల విన్యాసాలు

జోరందుకున్న ఇసుక అక్రమ రవాణా!



గంగవరం మండలం గుండుగల్లు వద్ద ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆదాయ వనరుగా మారింది. ఇసుకను కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికే కౌండిన్య నదిని ఖాళీ చేసేశారు. ఇప్పుడు వారి కన్ను పలమనేరు నియోజకవర్గంలోని వందకు పైగా వున్న చెరువులపై పడింది. బంకమట్టిని కొందరికి విక్రయిస్తూ దానికిందనున్న ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జాతీయ రహదారిలో పట్టపగలే ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

- పచ్చనేతలకు కాసులు కురిపిస్తున్న ఇసుక వ్యాపారం
- డంపుల వద్దే కొనుగోలు చేస్తున్న కర్ణాటక వ్యాపారులు
- కౌండిన్యలో ఇప్పటికే ఇసుక నిల్వలు ఖాళీ
- చెరువులపై పడిన అక్రమార్కుల కన్ను
- పట్టపగలే హైవేలో వెళుతున్నా పట్టించుకోని అధికారులు

పలమనేరు: కర్ణాటక ప్రాంతంలో ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉంది. గతంలో ఇసుక వ్యాపారులు ఇక్కడి నుంచి రాత్రిళ్లు దొంగచాటుగా కర్ణాటకలోని హొసకోటకు తరలించేవారు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు చేరవేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతల అండదండలతో వ్యాపారులు రెచ్చిపోతున్నారు. కర్ణాటక నుంచే టిప్పర్లు డంపుల వద్దకు వచ్చి ఇసుక తీసుకెళ్లే పరిస్థితి నెలకొంది. కూటమి నేతలు ఇసుక తరలించేందుకు రేట్లను నిర్ణయించారు. ఇందులో ఒక ట్రాక్టర్ ఇసుకను చెప్పిన చోట దింపితే రూ.2 వేలు, టెన్ వీలర్ టిప్పర్‌లో ఇసుక తరలిస్తే రూ.12 వేలుగా ధర నిర్ణయించారు. ముందుగా ఇసుకను రహస్య ప్రదేశాల్లో డంపు చేస్తున్నారు. రాత్రిళ్లు కర్ణాటక నుంచి టిప్పర్లు రాగానే ఇసుకను లోడ్ చేసి పంపిస్తున్నారు.

ఎలాంటి ఇబ్బందులు లేకుండా...

నదిలో ఇసుకను తోడుతున్న వారిని అడిగితే ఇంటి నిర్మాణానికని చెబుతున్నారు. ఇంకొందరు ట్రాక్టర్లకు పచ్చ పెయింట్, డ్రైవర్‌కు పచ్చ కండువా, జేబులో చంద్రబాబు ఫొటో పెట్టుకుని అధికారులనే బెదిరిస్తున్నారు. నియోజకవర్గంలోని కొంగోళ్లపల్లి, ముసలిమడుగు, కూర్మాయి, మొరం, ముదరంపల్లి, బైరెడ్డిపల్లి, గుండుగల్లు, చిన్నూరు తదితర గ్రామాల్లో ఇసుక రవాణా చేసే వారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఈ గ్రామాల్లో పది నుంచి ఇరవై ట్రాక్టర్లు, గ్రామానికి రెండు, మూడు జేసీబీలు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

డబుల్ ధమాకా..

నియోజకవర్గంలోని చెరువుల్లో పైన బంకమట్టి, దానికింద నాణ్యమైన ఇసుక లభిస్తోంది. దీన్ని గమనించిన అక్రమార్కులు చెరువుల్లో జేసీబీలను పెట్టి మట్టిని తోడేస్తున్నారు. దీన్ని రైతులు పొలాలు లేదా రియల్ ఎస్టేట్ వెంచర్లకి తోలుకుంటున్నారు. మరికొందరు ఉపాధిలో పొలాలకు బంకమట్టిని రైతులకు తోలి బిల్లులు తీసుకుంటున్నారు. ఇసుకను కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌కు జై టీడీపీ, జై చంద్రబాబు అని రాసుకుంటున్నారు. దీంతో అధికారులు మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై స్థానిక ఇరిగేషన్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా మాట్లాడేవారే కరువయ్యారు.



గంగవరం మండలం తెట్టుమిట్ట వద్ద ఉన్న ఇసుక డంపు



ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్న వైనం

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు అర్బన్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం చిత్తూరు కలెక్టరేట్, ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు నేరుగా తనను కలిసి సమస్యలు తెలపవచ్చని, వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

‘త్యాగధనులను ఆదర్శంగా తీసుకుందాం’



జెండా ఎగుర వేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: దేశ స్వాతంత్ర్యం జీవితాలను త్యాగం చేసిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని జిల్లా జడ్జి భీమారావు తెలిపారు. చిత్తూరు నగరంలోని జిల్లా కోర్టులో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగుర వేసి వందనం సమర్పించారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ నరసింహప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, సహాయ కమిషనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి వీరజవాన్ కార్తీక్ పేరు



ఎగువరాగిమానుపెంట హౌసింగ్ కాలనీకి వీరజవాన్ కార్తీక్ కాలనీగా పెట్టిన బోర్డు

బంగారుపాళెం : మండలంలోని ఎగువరాగిమానుపెంట గ్రామంలోని హౌసింగ్ కాలనీకి వీరజవాన్ కార్తీక్ కాలనీగా పేరు పెట్టినట్లు సర్పంచ్ శ్రీహరి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన సెల్వి, వరదరాజులు మండడి దంపతుల రెండో కుమారుడు కార్తీక్ జవాన్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22న జమ్ముకశ్మీర్ సరిహద్దులో ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాలనీకి వీరజవాన్ కార్తీక్ కాలనీగా పేరు మార్పు చేశామన్నారు. ఇందుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసినట్టు తెలిపారు. కాలనీకి వీరజవాన్ కార్తీక్ కాలనీగా పేరు పెట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

గణతంత్ర దినోత్సవం రోజూ కొనసాగిన రైతు దీక్షలు


దీక్ష చేస్తున్న రైతులు

కుప్పం రూరల్: దేశం మొత్తం ఆదివారం గణతంత్ర దినోత్సవం జరుపుకుంటుంటే కుప్పం మండల రైతులు మాత్రం దీక్షలో పాల్గొన్నారు. కుప్పం మండలం ఆవులనత్తం వద్ద ఉన్న జెల్లి ఫ్యాక్టరీ వల్ల తమకు నష్టం కలుగుతోందని పేర్కొంటూ రైతులు 20 రోజులకు పైగా దీక్ష చేస్తున్నారు. అధికారులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో వారు ఆదివారం కూడా దీక్ష కొనసాగించారు. వారు మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు జెల్లి ఫ్యాక్టరీ యాజమాన్యంతో కలిసిపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అందువల్లే తమ గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్ష ఆపేది లేదని తేల్చి చెప్పారు.

రేపు ఆటో యూనియన్ మహాసభ


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని మార్కెట్ యార్డులో మంగళవారం ఆటో యూనియన్ జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, జిల్లా నాయకుడు విజయ్‌కుమార్ తెలిపారు. వారు ఆదివారం ఆటో డ్రైవర్లతో కలిసి చిత్తూరులో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఏడాదికి రెండు సార్లు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి పరీక్షలు చేయించాలని కోరారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆటో ఇన్సూరెన్స్‌ల మొత్తాన్ని సగానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పలు సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, మోహన్, ఉమాపతి, రఘు, నాగరాజా, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,651 మంది స్వామివారిని దర్శించుకోగా 26,677 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

- 317 మంది ఉద్యోగులకు ప్రశంసలు
- అవార్డులు అందజేసిన కలెక్టర్, ఎస్పీ


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తోటా పురుషోత్తం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని జిల్లా పోలీసు మైదానంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలు అందించిన 317 మంది వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు అందజేశారు. ఈ వేడుకల్లో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎఫ్‌వో భరణి తదితరులు పాల్గొన్నారు.


సాంబశివారెడ్డి, జిల్లా స్టాటిస్టిక్స్ ఆఫీసర్


చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ


మధుసూదనరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి


శ్రీనివాసరావ్, మున్సిపల్ కమిషనర్, కుప్పం


గురువారెడ్డి, డీఈఈ, కుప్పం


రవికుమార్, డీఎల్‌డీవో, చిత్తూరు


కులశేఖర్, కలెక్టరేట్ ఏవో


దినేష్‌కుమార్, కలెక్టర్ సీసీ


మనోజ్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ సీసీ


శేషగిరి రావ్, తహసీల్దార్, నింద్ర


చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, గుడిపాల


చిట్టిబాబు, తహసీల్దార్, కుప్పం


శివరాజ్, ఎంపీడీవో, గుడిపాల


ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎంపీడీవో, శాంతిపురం


గౌరి, మేనేజర్, పర్యాటక శాఖ, చిత్తూరు


శివానందకిశోర్, ఏఆర్ ఏఎస్పీ, చిత్తూరు


మహబూబ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ, చిత్తూరు

జిల్లా ట్రాన్స్‌కోకు పలు అవార్డులు


సీఎండీ సంతోషరావు నుంచి అవార్డు అందుకుంటున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కోకు పలు రంగాల్లో అవార్డులు వచ్చాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తిరుపతిలో సీఎండీ సంతోషరావు వీటిని అందజేశారు. సంవత్సర కాలంలో విద్యుత్ ప్రమాద రహిత డివిజన్‌గా చిత్తూరు అర్బన్ డివిజన్ నిలిచింది. అదేవిధంగా వర్క్ ఆర్డర్లను త్వరగా పూర్తి చేసిన డివిజన్‌గా చిత్తూరు నగర సబ్ డివిజన్ నిలిచింది. ఈ క్రమంలో చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, చిత్తూరు నగర సబ్ డివిజన్ మిట్టూరు సెక్షన్ ఏఈ రాజేంద్రబాబు అవార్డులు అందుకున్నారు. వంద శాతం విద్యుత్ బిల్లులు వసూలు చేసినందుకు పుంగనూరు సబ్‌డివిజన్ డీఈ శ్రీనివాసులు, పైపల్లె ఏఏవో నాగేంద్రకు అవార్డులు అందజేశారు.

నత్తనడకన ఎంఎస్ఎంఈల సర్వే

– క్షేత్రస్థాయి అధికారుల్లో అలసత్వం

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ర్యాంపు సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. 7 రోజులు మాత్రమే గడువుంది. ఈలోపు వంద శాతం పూర్తి చేస్తారా లేదా అన్నది అనుమానమే. ఎంఎస్ఎంఈల సర్వే ద్వారా ఉద్యమ్ గుర్తింపు సంఖ్య వచ్చిన తర్వాత నష్టాల్లో ఉన్న పరిశ్రమలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. అన్ని విధాలా ఆదుకోడానికి ఈ సర్వే ఎంతో కీలకం. క్షేత్రస్థాయిలో అధికారుల్లో అలసత్వం కారణంగా ముందుకు సాగడం లేదు. ఈ సర్వే నవంబరు 29న మొదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నాటికి ప్రక్రియ ముగియనుంది. జిల్లాలో మొత్తం 67,151 ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు విద్యుత్ సర్వీసుల ఆధారంగా ప్రాథమిక అంచనా వేశారు. ఇప్పటి దాకా 20,111 ఎంఎస్ఎంఈలను సర్వే చేయగా ఇంకా 47,040 పరిశ్రమల్లో సర్వే చేయాల్సి ఉంది. ముఖ్యంగా చిత్తూరు, పెనుమూరు, నగరి, యాదమరి, పలమనేరు, గుడిపాలలో 8 నుంచి 20 శాతం కూడా పూర్తి కానట్లు అధికారుల లెక్కలను బట్టి తెలుస్తోంది. ఉన్నవాటిలో సోమల, పుంగనూరు, శాంతిపురం, రొంపిచెర్ల ప్రాంతాల్లో 88 నుంచి 97 శాతం పూర్తయింది. పరిశ్రమల సంఖ్య తక్కువగా ఉన్న పాలసముద్రం, కార్వేటినగరం, నింద్ర, బంగారుపాళ్యం, గంగవరం ప్రాంతాల్లో దాదాపు 30 శాతం సర్వే కూడా పూర్తి కాలేదు.

ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కీలకం

ప్రజలకు ఆధార్ ఎలాగో ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అంతకీలకమైంది. ప్రతి పరిశ్రమకూ ఒక నంబరు ఉవ్వడంతోపాటు వివరాలు నమోదు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ సర్వేలో వివరాలు నమోదు చేసి వారికి ఉద్యమ్ నంబర్ ఇస్తారు. భవిష్యత్‌లో చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, నష్టాలు వస్తే పరిహారం ఇవ్వాలంటే క్షేత్రస్థాయిలో వాటి సంఖ్య తెలియాలి. అందుకోసమే సర్వే చేయిస్తున్నారు. ఉద్యోగుల నిర్లక్ష్యంతో సర్వే పడకేసినట్లు తెలుస్తోంది. వీటిపై కలెక్టర్, పరిశ్రమలశాఖాధికారులు నిత్యం సమీక్షిస్తున్నా ఆశించిన స్థాయిలో పని జరగడం లేదు.

నడకతోనే ఆరోగ్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు కార్పొరేషన్: నిత్య జీవితంలో నడకతోనే ఆరోగ్యం కలుగుతుందని డీఎఫ్‌వో భరణి తెలిపారు. ప్రతి ఒక్కరూ నడక సాగించాలని పిలుపునిచ్చారు. చిత్తూరులోని నగరవనంలో ఆదివారం వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం కష్టంగా మారిందన్నారు. మనకంటూ రోజూ కొంత సమయాన్ని కేటాయించుకుని శారీరక శ్రమ చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 40, ఆపై ఏళ్ల వారికి వేర్వేరుగా 3 కే, 5కే రన్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన 12 మందికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో థామస్, వాకర్స్ అసోసియేషన్ నాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఓదార్పు


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరులు

నగరి: మున్సిపాలిటీ కరకంతాపురం దళితవాడలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అన్బు ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరులు వై.కుమారస్వామి రెడ్డి అతని స్వగృహానికి చేరుకుని మృతదేహంపై పూలదండలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పలువురికి ఏఈలుగా ఉద్యోగోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో పలువురికి సబ్‌ఇంజినీర్ నుంచి ఏఈలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలసముద్రం సబ్ ఇంజినీర్ లోకేష్ రెడ్డి, మిట్టూరు సెక్షన్ నుంచి శివకుమార్, బంగారుపాళ్యం సెక్షన్ నుంచి ప్రసన్న, పుంగనూరు డివిజన్ కార్యాలయం నుంచి ప్రసాద్, ఉమామహేశ్వర్లుకు ఉద్యోగోన్నతి లభించింది. వీరికి త్వరలో స్థానాలు కేటాయించనున్నారు.

గరుడ గమనా రారా..!

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీరాధిక కూచిపూడి నృత్యాలయ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అదివో అల్లదివో, ఘల్లు ఘల్లు, వస్తావ జానకి, జాజిరి జాజిరి, కోయిలారే, శ్రీలలితా హారతి, గరుడ గమనా రారా, ఓ పిల్లడా ఎంకటేశా తదితర పాటలకు కళాకారులు పావని, గీతిక, కోమలశ్రీ, చరిష్మ, గౌరవి, జస్మిత, హేమశ్రీ, షణ్ముఖ ప్రియ, భవ్య, రిత్విక, భవిష్య అభినయించిన హావభావాలు మంత్రముగ్ధం చేశాయి. కళాకారులను ఏవో ఖాదర్‌వలీ సత్కరించారు.

మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా

- క్లీనర్ మృతి
- డ్రైవర్‌కు తీవ్రగాయాలు


మృతి చెందిన లారీ క్లీనర్ సోనూ


చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ అనీల్‌మీనా


సిలికాలో పూడుకుపోయిన క్లీనర్‌ను బయటకు తీసున్న స్థానికులు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్‌లోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం లారీ బోల్తాపడడంతో క్లీనర్ మృతి చెందాడు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు.. బెంగళూరు నుంచి చెన్నైకి సిలికాన్ ఇసుక తరలిస్తున్న లారీ మొగిలి ఘాట్‌లో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ రాజస్తాన్‌లోని నింబాడ్‌కు చెందిన సోనూ(35), పతాఫ్‌ఘడ్‌కు చెందిన లారీ డ్రైవర్ అనీల్ మీనా(37) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, వాహనదారులు ఇసుకను తొలగించి క్లీనర్‌ను బయటకు తీశారు. అనంతరం ఇద్దరినీ బంగారుపాళెం ఆస్పత్రికి తరలించారు. క్లీనర్ సోనూ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెల్లువెత్తిన అభిమానం





మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లెలో ఆదివారం సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ యువత తమ కోడె గిత్తలకు పార్టీ జెండాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి చిత్ర పటాలు అలంకరించి అభిమానం చాటుకున్నారు. మా దేవుడి మీద సత్యం అని చెక్కతో ముస్తాబుచేశారు. – చౌడేపల్లె

సాక్షి క్లాసిఫైడ్స్

Education

CARRER OPERTUNITY
Failed in B.Tech or Degree? Don't worry! Finish your course in just 6 months and study your Master's abroad with NICC Global Education.Tirupati,9392578108,9182754522.

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA,Regular/lateral entry.9381287629

10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, B.Lis, MA, M.Com, M.Sc, MCA, MBA, M.Lis, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT. ✆ 90320 30124.

Real Estate


FLAT FOR SALE
తిరుపతి రేణిగుంట రోడ్ S.V.ఆటోనగర్ ఐదిత్రి ఎంక్లేవ్ గేటెడ్ కమ్యూనిటీనందు 3 BHK, W/F, 1630 Sq.Ft., తో గల అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అన్ని సౌకర్యాలతో అమ్మబడును. ✆ : 94901 66549, 97034 80975

PLOTS FOR SALE
తిరుపతిలో తాజ్ హోటల్ ఎదురుగా బెంగళూరు హైవేకి ఆనుకొని అపార్ట్‌మెంట్లు మరియు IIT దగ్గర 6 లక్షలకే ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు కలవు. రెడి టు ఆక్యుపై, స్పాట్ రిజిస్ట్రేషన్. 95027 74175, 7416211984.

తిరుపతి జిల్లా, గూడూరు దగ్గర తిరుమల డైరీ పార్లర్ దగ్గర కడివెడు రోడ్డు ఆనుకొని 25 అంకణముల లేఅవుట్ బిట్ అమ్మబడును. సంప్రదించండి: 91335 43962, 93461 15780.

TOLET
తిరుపతి ఓటేరు మెయిన్ రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 650Sft, 110 Sft & 1st ఫ్లోర్‌లో 650Sft, 110 Sft అద్దెకు కలదు.కార్ పార్కింగ్, బాత్‌రూం సౌకర్యం కలదు. ✆ 9441912555.

TOURS & TRAVELS



మహా కుంభమేళా యాత్ర. 12 రో. త్రివేణి సంగమం స్లీపర్ బస్సుయాత్ర 1 టికెట్టు 20,500 7 రో., విమాన ప్రయాణం 1 టికెట్టు 32,000 (ఉ. టిఫిన్, 2 పూటల భోజనం, రూం బాడుగ, గైడ్) 9440161652, 9440009632.

Wanted

తిరుపతిలోని ఒక లాడ్జిలో పనిచేయుటకు రూం బాయ్స్ కావలెను. మంచి జీతం+భోజనం+వసతి. సంప్ర: 80195 18646, 90520 72006.

ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలో పనిచేయుటకు అనుభవం, వాక్‌చాతుర్యం కలిగిన లేడీ టెలికాలర్స్& లేడీ ఆఫీస్ ఇంచార్జ్ కావలెను. ✆ 90320 30124.

Wanted Experience Teachers for High School Selection Sub:Physical Science,Biology, Sanskrit, Worked at Tirupati.99660 52499, 8801277691.

నెల్లూరు జిల్లా, గూడూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు అనుభవం ఉన్న సెక్యూరిటీ ASO కావలెను. 12hrs డ్యూటీ, జీతం: 19000. PF, ESI కలదు. Contact: 96189 71229.

Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషేంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతిఫుడ్ జీ:20k ఫోన్: 8977639662, 8977639663

మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతిరోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిస్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 9666253675

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉపాధి కూలీలపైనా కక్ష సాధింపు


బైరెడ్డిపల్లి మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూటమి సానుభూతి కూలీలు(ఫైల్),


నిష్కారణంగా విధుల నుంచి తొలగించారని ఫిర్యాదు చేస్తున్న బైరెడ్డిపల్లి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ నేతలు కక్ష సాధింపు చర్యలకు దిగారు. చిన్న ఉద్యోగులపై వేధింపులకు పాల్పడ్డారు. అంతటితో ఆగక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను బలవంతంగా విధుల నుంచి తొలగించారు. తాజాగా ఉపాధి హామీ కూలీలపై ప్రతాపం చూపుతున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులని ముద్రవేసి పనులు కల్పించకుండా వేధిస్తున్నారు. ఏపీఎంలు, జిల్లా అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో కూలీలు వలస బాట పడుతున్నారు.

- ఉపాధి అసిస్టెంట్లు, మేట్ల తొలగింపు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు పనులు కల్పించని వైనం
- బతిమలాడినా ఫలితం శూన్యం
- పట్టించుకోని జిల్లా అధికారులు
- ఇది కుప్పం, పుంగనూరు సీఎల్ఆర్సీ పరిధిలో తతంగం

పలమనేరు : పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో పుంగనూరు, కుప్పం సీఎల్ఆర్సీ ప్రాజెక్టులున్నాయి. పుంగనూరు క్లస్టర్‌లో పుంగనూరు, పెద్దపంజాణి, పలమనేరు, గంగవరం, చౌడేపల్లి, బంగారుపాళెం మండలాలు, కుప్పం క్లస్టర్‌లో కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం, వీకోట, బైరెడ్డిపల్లి మండలాలు ఉన్నాయి. వీటిలోవున్న 132 పంచాయతీల్లో 132 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 60 మందికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లు, 60 మంది మేట్లను తొలగించారు. వారి స్థానంలో అధికార పార్టీకి అనుకూలమైన వారిని చేర్చుకున్నారు. వారు ఉపాధి పనుల్లో జేసీబీలను పెట్టి పాత గుంతలకే నగిషీలు చెక్కి బినామీ కూలీల పేరుతో బిల్లులు స్వాహా చేసుకుంటున్నారు. వీరికి ఏపీవోల సాయం ఉండడంతో అక్రమంగా పనులు చేసినా సక్రమంగా బిల్లులవుతున్నట్టు తెలుస్తోంది.

30 వేల మందికి పనులు చూపని వైనం

పుంగనూరు, కుప్పం క్లస్టర్లలోని 132 పంచాయతీల్లో 1,19,898 కుటుంబాలు ఉండగా 2,16,603 మంది ఉపాధి జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. వారిలో ప్రస్తుతం 70,630 మంది పనులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పనులు చేసిన 30 వేల మంది కూలీలకు ప్రస్తుతం పనులు చూపడం లేదు. ఎందుకు పనులు కల్పించలేదని ప్రశ్నిస్తే మీరు వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని, అందువల్లే పనులు చూపడం లేదని చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ విన్నవించినా, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపినా ఏ అధికారీ స్పందించలేదు. దీంతో వారు ఉపాధి కరువై ఇతర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు. ఈ విషయమై కుప్పం ఏపీడీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. బైరెడ్డిపల్లి ఏపీవో హరినాథ్ మాట్లాడుతూ కూటమి నేతల మాట మీరి తాము ఏమీ చేసేందుకు వీలుకాదని, మా పరిస్థితిని మీరే అర్థం చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి పనులు ఇవ్వరంట సామీ



ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాకు ఉపాధి పనులు చూపలేదు. ఏమిసార్ అని అడిగితే మీరంతా వైఎస్సార్ సీపీకి ఓటేశారంటగా అంటున్నారు. మాకు రాజకీయాలు ఏంటికి సార్ కూలి పనులు చేసుకొని బతికేటోళ్లం. పనులు లేక ఖాళీగా ఉన్నాం. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఒ.నాగప్ప, ఉపాధి కూలి, బైరెడ్డిపల్లి

నిష్కారణంగా విధుల్లోంచి తొలగించేశారు



నేను మా పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. కూటమి ప్రభుత్వం రాగానే నిష్కారణంగా విధుల నుంచి తీసేశారు. ఇదేంటి సార్ అంటే కూటమి నేతలు నిన్ను తీసేయమన్నారు, ఏమన్నా ఉంటే వారితో మాట్లాడుకోమని మాపై అధికారులు చెబుతున్నారు. ఇదేమి న్యాయం సార్.

– సుబ్రమణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్, జీసీపల్లి, బైరెడ్డిపల్లి మండలం